# ఊహానగరీ.. ఏదీ నీ ఉనికి?!

విశాల రహదారులు.. వాటికి ఇరువైపులా కండ్లు చెదిరే ఆకాశహర్మ్యాలు.. అత్యాధునిక మౌలిక వసతులు.. పార్కులు.. స్విమ్మింగ్ పూళ్లు.. క్రీడా మైదానాలు.. ఇలా ఒక్కటేమిటి! చూసేందుకు రెండు కండ్లూ చాలవు. ఊహకు కూడా మన మేధస్సు సరిపోదు! అందమైన బ్రోచర్.. అంత కంటే అందమైన గ్రాఫిక్స్‌తో ప్రీలాంచ్ ప్రాజెక్టుల కోసం రియల్ ఎస్టేట్ కంపెనీలు అరచేతిలో చూపించే స్వర్గమిది!

అసలు భూమే ఉండదు! సర్వే నంబర్లేవో తెలియవు! కానీ, అక్కడ నగరమే ఏర్పాటైనట్టుగా రంగురంగుల డిజైన్లతో మతి పోగొట్టే గ్రాఫిక్స్‌తో బ్రోచర్లు వండి వార్చి.. 'కూటి కోసం కోటి విద్యలు' అన్నట్టు ప్రజలను బురిడీ కొట్టించేందుకు ప్రైవేటు కంపెనీలు ఎంతకైనా తెగిస్తాయి. ప్రీలాంచ్ పేరిట మోసం చేసే ఇలాంటి రియల్ కంపెనీలపై కేసులు నమోదవుతుంటాయి.


'చరిత్రలో హైదరాబాద్ మహా నగరం మూడు నగరాలుగా ఏర్పడితే.. బేగరి కంచె కేంద్రంగా నేను నాలుగో నగరాన్ని సృష్టిస్తున్నా!' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దానికి ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్‌సిటీ అంటూ నోటికొచ్చిన పేర్లు పెట్టారు. భావి తరాలకు ఇదే స్వర్గధామం అంటూ ముఖ్యమంత్రి సహా మంత్రులంతా బ్రాండ్ అంబాసిడర్లుగా మారి ప్రకటనలు గుప్పించారు. ఇక్కడే ఏఐ సిటీ.. స్పోర్ట్స్ సిటీ.. ఐఐహెచ్‌టీ.. జూపార్కు.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు.. రేస్ క్లబ్.. ఇలా ఒక్కటేమిటి! 11 నెలల్లో సీఎం రేవంత్ నోటి వెంట జాలువారిన అనేక ప్రాజెక్టులకు ఫోర్త్‌సిటీలోనే భూ కేటాయింపులు చేస్తున్నట్టు ప్రకటించారు.

ఇంతకీ ఫోర్త్‌సిటీ ఎక్కడ ఏర్పాటవుతుంది? దాని విస్తీర్ణం ఎంత? సర్వేనంబర్లు ఏవి? దాని హద్దులు ఎక్కడ? తెలంగాణ తలరాతను మారుస్తుందని చెప్తున్న ఈ ఊహానగరికి కనీసం ముసాయిదా మాస్టర్ ప్లాన్ అయినా రూపొందించారా? మరి.. 14 వేల ఎకరాల్లో ఫార్మాసిటీనే ఏర్పాటు చేస్తే.. ఆ భావి నగరానికి భూములేవీ? ప్రత్యేకంగా భూసేకరణ చేయడం లేదంటే ప్రైవేట్ రియల్ కంపెనీలు పాల్పడే ప్రీలాంచ్ మోసాలకూ.. దీనికీ తేడా ఏమున్నది? ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే ఇలా కోర్టుకు ఓ మాట చెప్పి.. అందుకు విరుద్ధంగా గాల్లో మేడలు కడుతూ మభ్యపెట్టడాన్ని ఏమనాలి?!

## ఫోర్త్‌సిటీ హద్దులేవి? విస్తీర్ణమెంత? సర్వే నంబర్లేవి?

## ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లోనే రూపకల్పన

- ఫార్మా భూమిలోనే స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన
- ఏఐ సిటీ, స్పోర్ట్స్ సిటీ, ఐఐహెచ్‌టీ, జూపార్కు
- మాస్టర్‌ప్లాన్ లేకుండానే ఫ్యూచర్ సిటీ గాలిమేడలు
- ఫార్మా భూములు రైతులకే ఇస్తామని మ్యానిఫెస్టో
- 14 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ అని హైకోర్టుకు అఫిడవిట్
- కోర్టుకు రేవంత్ సర్కార్ చెప్పిందొకటి.. చేస్తున్నదొకటి!
- ప్రీలాంచ్ రియల్ ప్రాజెక్టులను తలదన్నే మాయాజాలం




హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఒక నగరాన్ని ఏర్పాటు చేయాలంటే దానికి భూసేకరణ చేయాలి. ఏయే సర్వేనంబర్లలో ఏర్పాటు చేస్తున్నారో రికార్డులు రూపొందించాలి. కనీసం ముసాయిదా మాస్టర్‌ప్లాన్ అయినా తయారు చేయాలి. మరి.. గత 11 నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి నోటి నుంచి జాలువారుతున్న ఫ్యూచర్ సిటీ ఏర్పాటులో భూతద్దం వేసి వెతికినా ఇవేవీ కనిపించడం లేదేంటి? వాస్తవానికి రంగారెడ్డి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద ఫార్మాసిటీ ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టు చేపట్టింది. దీనికోసం ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో 19,333.20 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఇందులో 9,806.05 ఎకరాలు రైతుల వద్ద ఉన్న ప్రైవేట్ భూమి కాగా, గతంలో టీఎస్‌ఐఐసీ రైతుల నుంచి సేకరించిన 400.75 ఎకరాలు, 2,704.90 ఎకరాల ప్రభుత్వ భూమి, టీఎస్‌ఐఐసీ ఆధీనంలోని మరో 6,209.50 ఎకరాలు, వంద ఎకరాల ట్రాన్స్‌కో భూములతో పాటు 110 ఎకరాల విస్తీర్ణంలో నీటి వనరులున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఇందులో దాదాపు 14 వేల ఎకరాలకు పైగా భూ సేకరణ పూర్తి చేసింది. రైతుల నుంచి సేకరించిన పట్టా భూములు సుమారు 3-4 వేల ఎకరాల వరకు ఉండగా మిగిలినది సేకరించాల్సి ఉన్నది. ఫార్మాసిటీ ఏర్పాటుకు గాను మొదటి దశ అనుమతులు కూడా వచ్చాయి. తుది అనుమతులు రావాల్సి ఉన్నది. ఫార్మా సిటీలో కంపెనీల ఏర్పాటు కోసం 300-350 కంపెనీలు దరఖాస్తు కూడా చేసుకున్నాయి. రైతుల నుంచి సేకరించిన పట్టా భూమి ఎకరాకు రూ.16.50 లక్షల వరకు, అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.8.5లక్షల వరకు పరిహారం ఇచ్చింది. భూమిని కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చేందుకు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో 1400 ఎకరాల భూమి సేకరించి.. లేఅవుట్ చేసి ఎకరాకు 121 చదరపు గజాల అభివృద్ధి చేసిన ప్లాటును కూడా పంపిణీ చేసింది. భూములు కోల్పోయిన రైతు కుటుంబాల్లో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కందుకూరు మండల పరిధిలో 1400, యాచారం మండల పరిధిలో 3600 మందిని గుర్తించింది. వీరిలో సాంకేతిక అర్హతలు లేని వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు డ్రైవ్ కూడా చేపట్టింది. తుది అనుమతులు రాగానే దరఖాస్తు చేసుకున్న కంపెనీల్లో ప్రాధాన్యత, ఇతర అర్హతల మేరకు భూ కేటాయింపులు జరిగేవి. కానీ గత డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

### ఓవైపు షరతు.. మరోవైపు కాంగ్రెస్ హామీ

కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం షరతుతో కూడిన భూసేకరణ చేపట్టింది. రైతుల నుంచి సేకరిస్తున్న భూములను కేవలం ఫార్మా, దాని అనుబంధ రంగాలకు సంబంధించిన వాటి కోసమే వినియోగిస్తామని, లేనిపక్షంలో రైతుల భూములు తిరిగి ఇచ్చేస్తామనేది ఆ షరతు. ఈ క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు కేవలం ఫార్మాసిటీ కోసం మాత్రమే ఆ భూములను వినియోగించేందుకు పూర్తిస్థాయి ప్రక్రియలు చేపట్టింది. భూసేకరణ సమయంలో అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఫార్మాసిటీ కోసం రైతుల భూములను ఎలా తీసుకుంటారంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ప్రతిపక్షంలో ఉన్నపుడు రేవంత్‌రెడ్డి సహా ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన పాదయాత్రలో 'అధికారంలోకి వస్తే ఫార్మా సిటీ భూములను తిరిగి రైతులకు ఇస్తాం' అని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మ్యానిఫెస్టోలో కూడా ఈ మేరకు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీ రైతులు దీక్షలు.. డిమాండ్లు చేస్తున్నా ఆ హామీని తుంగలో తొక్కింది.

### కోర్టునే తప్పుదోవ పట్టిస్తూ..

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నదనేది అక్షర సత్యం. ఇందుకు సజీవ సాక్ష్యమే.. యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ! యూనివర్సిటీ ఏర్పాటు స్వాగతించదగినదే అయినా దాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.. పారదర్శకంగా వ్యవహరించాలి. గతంలో బేగరికంచె వద్ద యూనివర్సిటీని 150 ఎకరాల్లో ఏర్పాటు చేస్తానని సీఎం రేవంత్ ప్రకటించి, శంకుస్థాపన కూడా చేశారు. ఇటీవల మెగా ఇన్‌ఫ్రా కంపెనీ యూనివర్సిటీ భవనాల నిర్మాణం కోసం పనులు మొదలుపెట్టింది. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట పరిధిలోని బేగరికంచెలో సర్వేనంబరు 112, ఆకుల మైలారం పంచాయతీ పరిధిలోని పంజాగుడలోని సర్వే నంబరు 90ల్లోని 150 ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటు కానున్నది. వాస్తవంగా కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం ఈ భూములను షరతుతో సేకరించింది. అంటే ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల్లోనే ఫోర్త్‌సిటీని ఏర్పాటు చేస్తున్నారనేది రుజువైంది. ఇదే కాదు.. ఫోర్త్‌సిటీ పేరిట సీఎం రేవంత్‌తో పాటు పలువురు మంత్రులు అనేకసార్లు ఫార్మాసిటీ భూముల్లో ఇతర రంగాలకు చెందిన ప్రాజెక్టులకు భూ కేటాయింపులు చేస్తామంటూ ప్రకటించారు.

- ఫోర్త్‌సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీని 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది.
- స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలే కాకుండా ఇతర పలు యూనివర్సిటీలతో యూనివర్సిటీ జోన్ 600 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు
- ఫ్యూచర్ సిటీలోనే ఐఐహెచ్‌టీని నెలకొల్పుతున్నట్టు ప్రకటన
- శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్నందున ఫోర్త్‌సిటీలో 250 ఎకరాల విస్తీర్ణంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సిటీ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటన
- ఫోర్త్‌సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో గుజరాత్‌లోని జామ్‌నగర్ వన్‌తారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం తరహాలో ఏర్పాటు.. 2వేల ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ ఉండగా.. జూపార్క్, నైట్ సఫారీ, ఎకో టూరిజం కేంద్రానికి కేటాయింపులు.
- ఫ్యూచర్ సిటీలోనే హైదరాబాద్ రేస్ కోర్సుకు 160 ఎకరాలు కేటాయింపు
- ఫోర్త్‌సిటీలో 250 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ క్లాస్ గోల్ఫ్ క్లబ్
- ఫ్యూచర్ సిటీలో 70 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ తరహా బిజినెస్ హబ్ ఏర్పాటు
- ఫోర్త్ సిటీలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని పలు సమీక్షల్లో సీఎం రేవంత్ ప్రకటించగా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా సీఐఐ సదస్సుల్లో తెలిపారు. ఈ మేరకు రెసిడెన్షియల్, స్కూల్స్, ఇన్‌ఫ్రా కోసం 4 వేల ఎకరాలు కేటాయింపు
- ఫ్యూచర్ సిటీలో ఎలక్ట్రానిక్స్, ఇతరత్రా పరిశ్రమల ఏర్పాటు కోసం 6 వేల ఎకరాలు
- ఫోర్త్‌సిటీలో రీక్రియేషనల్ జోన్‌కు 550 ఎకరాలు
- ఫోర్త్‌సిటీలో ఫర్నిచర్ పార్క్ ఏర్పాటుకు 450 ఎకరాలు
- ఫ్యూచర్ సిటీలో హెల్త్‌సిటీకి 500 ఎకరాలు
- ఫ్యూచర్ సిటీలో లైఫ్‌సైన్స్ హబ్ ఏర్పాటు కోసం 3 వేల ఎకరాలు
- సౌత్ కొరియా యంగ్ వన్ కార్ప్ ఆధ్వర్యంలో ఫ్యాషన్ టెక్నాలజీ వర్సిటీకి 20 ఎకరాలు
- జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలోనే ఇండ్ల స్థలాల కేటాయింపు ఉంటుందని రవీంద్ర భారతిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- ఇవన్నీ కాకుండా ఫోర్త్‌సిటీలో 41 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరుతో 300 ఫీట్ల వెడల్పుతో రహదారి నిర్మాణం
- శంషాబాద్ విమానాశ్రయం, రీజినల్ రింగు రోడ్డును అనుసంధానించేందుకు రహదారుల నిర్మాణం, మెట్రోరైలు నిర్మాణాలు

## కోర్టుకు లిఖితపూర్వక హామీ..

ఫార్మాసిటీ కోసం చేపట్టిన భూసేకరణ అనేది షరతుతో కూడినది. కచ్చితంగా ఫార్మా, అనుబంధ రంగాల కోసం భూమిని వినియోగించాలి.. లేకుంటే రైతులకు తిరిగివ్వాలనేది నిబంధన. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో ప్రకటనతో ఫార్మాసిటీ ప్రాజెక్టును గందరగోళంలోకి నెట్టింది. దీంతో భూములు కోల్పోయిన రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ భూములు తిరిగివ్వాలని కోరారు. 'అసలు ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నారా?.. సమాధానం ఇవ్వండి' అని హైకోర్టు ఆదేశించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా అఫిడవిట్ సమర్పించింది. అందులో ఫార్మాసిటీ కోసం సేకరించిన 14 వేలకు పైగా ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని, ఆ భూములను అందుకే వినియోగిస్తామని హామీ ఇచ్చింది.

## ఫార్మాసిటీపై పూటకోమాట!

**'కాలుష్య కారక ఫార్మాసిటీ నగరానికి సమీపంలో కాకుండా.. సుదూర ప్రాంతంలో ఏర్పాటు చేయాలి'**

నిరుడు డిసెంబర్ 13న జరిగిన సమీక్షా సమావేశంలో ఫార్మాసిటీకి బదులు ఆ భూముల్లో మెగాసిటీ ఏర్పాటు చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలో భాగంగా చేసిన వ్యాఖ్య ఇది..

**'ఔటర్ రింగు రోడ్డు - ట్రిపుల్ ఆర్ మధ్యలో పారిశ్రామికవాడల గుర్తింపు కోసం 500 నుంచి 1000 ఎకరాల భూసేకరణ చేయండి'**

డిసెంబర్ 18న (ఐదు రోజుల వ్యవధిలో) నిర్వహించిన సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశమిది.

**'ఫార్మాసిటీని రద్దు చేయడం లేదు'**

జనవరి 1న మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది

**'ఔటర్ రింగు రోడ్డు - ట్రిపుల్ ఆర్ మధ్య మూడు వేల ఎకరాల్లో వివిధ ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. గత ప్రభుత్వం వేల ఎకరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఫార్మాసిటీ విధానం సరికాదు. అందుకే దాన్ని రద్దు చేసి, అక్కడ శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం'**

గత మార్చిలో జరిగిన కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ వార్షిక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటన ఇది. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి కేసీఆర్ హయాంలో చివరి దశకు వచ్చిన ఫార్మాసిటీ ఏర్పాటుపై ఇలా పూటకో ప్రకటన చేసి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం గందరగోళంలోకి నెట్టింది. రైతుల త్యాగాన్ని అపహాస్యం చేసింది.

## ఎందుకీ రహస్య ఎజెండా?

కేసీఆర్ హయాంలో సేకరించిన 14 వేలకు పైగా ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైకోర్టుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. కానీ ఫోర్త్‌సిటీ పేరిట సాగుతున్న ఈ కేటాయింపుల పర్వానికి భూములు ఎక్కడివి? అనే దానిపై మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. ఓవైపు ఫార్మాసిటీ భూముల్లోనే వీటిని ఏర్పాటు చేస్తూ న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఒకవిధంగా నిబంధనల ప్రకారం రైతులకు తిరిగి భూములు ఇవ్వాల్సి వస్తుందనే కారణంతోనే రేవంత్ ప్రభుత్వం కోర్టులో ఓ మాట.. బయట ఇంకో మాట చెప్తూ పబ్బం గడుపుతున్నదనేది సుస్పష్టం. ఒక ప్రైవేట్ రియల్ ఎస్టేట్ కంపెనీ ఇలా వ్యవహరిస్తే ఏమో గాని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వమే ఇలా రైతులకు తిరిగి భూములు ఇవ్వాల్సి వస్తుందని కోర్టు అఫిడవిట్‌లో ఒక హామీ ఇచ్చి, బయట భిన్నంగా వ్యవహరించడం విస్మయానికి గురి చేస్తున్నది. ఫోర్త్‌సిటీ పేరిట రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన భూ కేటాయింపులే దాదాపు 15 వేల ఎకరాలకు పైగా ఉన్నాయి. ఈ క్రమంలో ఫార్మాసిటీ భూములను పూర్తిగా ఫ్యూచర్ సిటీకి వినియోగించినా ఇంకా అదనంగా భూములు కావాల్సి ఉంటుంది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా భూసేకరణ చేపట్టనుందా? ఇదే జరిగితే.. మరి ఫార్మా సిటీ ప్రాజెక్టును అటకెక్కించినట్టేనా? అందుకే ఫార్మాసిటీకి ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో పది చోట్ల ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు మరో 20వేల ఎకరాల భూసేకరణ చేపడుతున్నారా? అనే ప్రశ్నలకు బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరమున్నది.


కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చిన హరీశ్‌రావును శాలువా కప్పి సన్మానిస్తున్న స్థానిక నేతలు, కార్యకర్తలు


హనుమంతుడిని దర్శించుకుంటున్న హరీశ్


మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు

# కల్పవృక్షం కేసీఆర్ .. కలుపుమొక్క రేవంత్

> సీఎం రేవంత్‌రెడ్డికి కేసీఆర్ భయం పట్టుకున్నది. అందుకే నిన్న వరంగల్ సభలో 45 నిమిషాల్లో 50 సార్లు కేసీఆర్ జపం చేసిండు. ఇక్కడ ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదు కానీ, మహారాష్ట్రకు వెళ్లి తెలంగాణలో ఆడబిడ్డలకు రూ.3 వేలు ఇచ్చినమని చెప్పిన ఘనుడు రేవంత్. సీఎం మాట్లాడే భాషతో ఇండ్లల్లో టీవీలు బంద్ చేసుకునే పరిస్థితి వచ్చింది. -హరీశ్‌రావు

- కలలోనూ రేవంత్‌కు కేసీఆర్ భయం
- రేవంత్ నోటికొచ్చేవి ఒట్లు, తిట్లు
- సీఎం మాట్లాడే భాషేనా ఇది?
- మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కేసీఆర్ కల్పవృక్షమైతే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలుపుమొక్క' అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 'ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా ఇది? రేవంత్ నోటికి వచ్చేవి ఒట్లు లేకుంటే తిట్లు' అని ఎద్దేవాచేశారు. 'కాంగ్రెస్ సీనియర్లను తొక్కుకుంట సీఎం అయినవు.. దేవుళ్ల మీదే ఒట్లు పెట్టి ప్రజలను మోసం చేసినవు' అని ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం కురుమూర్తి క్షేత్రంలోని వేంకటేశ్వర స్వామిని బుధవారం హరీశ్‌రావు దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'మొన్నీమధ్య రేవంత్‌రెడ్డి కురుమూర్తి వద్దకు వస్తే.. ఆ దేవుడి మీద ఒట్టేసి తప్పుడు చేసిండు కాబట్టి ప్రాయశ్చిత్తం చేసుకోడానికి వచ్చిండేమో? అనుకున్న. తప్పయింది.. క్షమించుమని కురుమూర్తి స్వామిని వేడుకుండడేమో అనుకున్న.. ఒట్టేసి మాట తప్పి ఒక బాధ్యత కలిగిన నాయకుడిగా ఆయన ప్రాయశ్చిత్తం చేసుకోలేదు' అని దుయ్యబట్టారు. 'రేవంత్‌రెడ్డికి మాటలెక్కువ చేతలు తక్కువ.. పరిపాలన చేతగానోడు.. ఓడిపోయేటోడు ఫ్రస్టేషన్‌లో తిట్ల పురాణం అందుకుంటడు' అని నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌నే కోరుకుంటున్నారని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్‌కు 100 సీట్లు ఖాయమని చెప్పారు.

### రేవంత్‌కు నిద్రలో కూడా కేసీఆరే..

'రేవంత్‌రెడ్డి నిన్న 45 నిమిషాల ప్రసంగం చేస్తే 50 సార్లు కేసీఆర్‌నే యాది చేసుకున్నడు.. ఆయనకు నిద్రలో కూడా కేసీఆరే యాదికొస్తడు. తన పని అయిపోయిందని రేవంత్‌కు అర్థమైంది. ప్రజలంతా కేసీఆర్‌నే తలుస్తున్నరని అర్థమైంది. ఆ భయంతోనే నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నడు' అని హరీశ్ ఎద్దేవాచేశారు. 'పాలకుడే పాపం చేస్తే ఆ రాజ్యానికి అరిష్టం.. అందుకే కురుమూర్తి స్వామిని వేడుకున్నం. నీ మీద ఒట్టు పెట్టి మాట తప్పిండు.. ఆ పాపాత్ముడిని క్షమించు అని కురుమూర్తి వెంకన్నకు మొక్కుకున్నం' అని తెలిపారు. 'తెలంగాణ ఏమీ కోల్పోలేదని రేవంత్ అన్నడు.. ప్రజలు రైతుబంధు, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, చేపలు, గొర్రెలను కోల్పోయింద్రు. ఆరు గ్యారెంటీలు అమలు కాలే కానీ, రేవంత్‌రెడ్డి వచ్చినంక బీ ట్యాక్స్ వచ్చింది. హైదరాబాద్‌లో ఇల్లు కట్టాలంటే ఆర్ ట్యాక్స్ ఇంకా యూ ట్యాక్స్‌లు వచ్చినయ్. రేవంత్ వచ్చాక బీఆర్‌యూ ట్యాక్స్‌లు వచ్చినయ్' అని ఎద్దేవాచేశారు.

### రేవంత్ కనిపిస్తే టీవీలు ఆఫ్ చేస్తుండ్రు

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుంటే ఆయన భాష విని ప్రజలు ఇంట్లో టీవీలు ఆఫ్ చేసుకుంటున్నరు అని హరీశ్ దెప్పిపొడిచారు. కేసీఆర్‌ను రైతుల సీఎంగా.. రేవంత్‌ను బూతుల సీఎంగా అనుకుంటున్నారని చెప్పారు. వరంగల్ మీటింగ్‌కు మహిళలను తీసుకొచ్చి వారికేదో ఇచ్చిన హామీని నెరవేరుస్తాడనుకుంటే ఒక్కటీ నెరవేర్చలేదని ఎద్దేవాచేశారు. మహాలక్ష్మి పథకంలో తొలి హామీ మహిళలకు రూ.2,500 ఇస్తాడని ఆశపడి ఆడబిడ్డలు భంగపాటుకు గురయ్యారని చెప్పారు. మహిళా సంఘాలకు రుణాలిస్తామని చెప్పిండు కానీ అవి కూడా ఇవ్వకుండా దాటవేస్తున్నారని విమర్శించారు. 'ఈ ప్రభుత్వానికి వడ్లు కొనడం కూడా చేత కావడం లేదు.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని.. సివిల్ సప్లయి కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని అంటున్నరు.. ఇప్పటి వరకు 20 లక్షల మెట్రిక్ టన్నులే కొన్నరు.. చాలా మంది రైతులు దళారులకు అగ్గువకే అమ్ముకున్నరు' అని వాపోయారు.

> మద్యం అమ్మకాలకు టార్గెట్ పెట్టి ఎక్సైజ్ అధికారులకు మెమో ఇచ్చిన ఘనత రేవంత్‌రెడ్డిది. ధాన్యం, పత్తి కొనకుంటే అధికారులకు మెమోలు లేవు కానీ, మద్యం అమ్మకపోతే మాత్రం మెమోలిచ్చిండు. మద్యం మీద పదివేల కోట్ల అదనపు ఆదాయం రావాలని వారిపై ఒత్తిడి తెస్తుండు. మంత్రి జూపల్లి, సీఎం రేవంత్‌ను అడుగుతున్న.. మద్యం అమ్మకాల కోసం అధికారులకు మెమోలిచ్చింది నిజం కాదా? -హరీశ్‌రావు

### మద్యం అమ్మకుంటే నోటీసులు

'మొన్నీ మధ్య కొందరు ఎక్సైజ్ అధికారులు నాకు ఓ పెండ్లిలో కలిసింద్రు.. సార్ మాకు మెమోలు వచ్చినయ్ అని చెప్పింద్రు. మందు అమ్ముతలేరని 30 మంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు.. 15 మంది సూపరింటెండెంట్లకు మెమోలు ఇచ్చింద్రట.. పోయినేడాది కంటే ఈసారి మందు తక్కువ అమ్మినందుకు ఇచ్చింద్రట. వడ్లు కొనకుంటే మాత్రం అధికారులను అడుగుతలేడు.. వడ్లు కొనని అధికారులకు మెమో లిస్తలేడు.. తాగుబోతుల తెలంగాణగా చేస్తావా? రేవంత్‌రెడ్డీ' అని హరీశ్ నిలదీశారు.

### రైతులకు మేలు జరుగుతుందంటే..

రైతులకు మేలు జరుగుతుందంటే తన ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి సిద్ధమని హరీశ్ స్పష్టంచేశారు. కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డికి నక్కకు నాకలోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉన్నదని ఎద్దేవాచేశారు. 'ఈ రాష్ట్రానికి నువ్వు ముఖ్యమంత్రి అయ్యావంటే అది కేసీఆర్ పెట్టిన భిక్షే.. కేసీఆర్ ఆదేశిస్తే మూడుసార్లు రాజీనామా చేసిన.. పంద్రాగస్టు లోపు పూర్తి రుణమాఫీ చేసుంటే రైతుల కోసం రాజీనామా చేసేవాడ్ని' అని గుర్తుచేశారు. 'ప్రతిపక్షంపై పగ.. ప్రజలకు దగా.. ఇదీ రేవంత్ తీరు.. కాంగ్రెస్ వచ్చాక ఎవరూ ఏమీ కోల్పోలేదని రేవంత్ అంటున్నాడు.. కేసీఆర్ సీఎంగా.. నిరంజన్‌రెడ్డి వ్యవసాయ మంత్రిగా విడుదల చేసిన చివరి రైతుబంధు తప్ప కాంగ్రెస్ వచ్చినంక ఇప్పటివరకు ఇవ్వలేదు' అని ధ్వజమెత్తారు.

### కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె : రైతులు

కురుమూర్తి వెంకన్న దర్శనానికి వెళ్తుండగా హరీశ్ వనపర్తి జిల్లా మదనాపురం మండలం లక్ష్మీపురం సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆగి రైతులతో మాట్లాడారు. రైతులు శాంతమ్మ, లక్ష్మయ్య మాట్లాడుతూ 'కేసీఆర్ ఉన్నప్పుడే మా రైతుల బతుకులు బాగుండె.. 24 గంటల విద్యుత్తు, టైముకు పెట్టుబడి సాయం అందింది. కొనుగోళ్లు మంచిగ జరిగేవి. పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ వస్తదని ఆశపడితే ఇప్పుడు ఉత్తదే అయ్యింది. నెలరోజులు చూసి బయట రూ.2100 చొప్పున అమ్ముకున్నం' అని చెప్పారు.

### శ్రీకాంత్‌గౌడ్‌కు హరీశ్ పరామర్శ

మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు శ్రీకాంత్‌గౌడ్ బెయిల్‌పై విడుదలయ్యారు. జిల్లా జైలులో ఉన్న ఆయనకు 27 రోజుల తర్వాత బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. శ్రీకాంత్‌గౌడ్ పాలకొండలోని ఫాంహౌస్‌లో ఉండగా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పాలమూరులో కూలగొట్టిన అంధులు, వికలాంగుల ఇండ్లను నిర్మించి ఇవ్వాలని అడిగినందుకే శ్రీకాంత్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని ధ్వజమెత్తారు. ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు.

### కొత్త పన్నులు వచ్చినయ్

'రేవంత్ వచ్చాక కొత్త పథకాలు వచ్చినయ్. బ్రూ ట్యాక్స్ వచ్చింది.. ఆయా శాఖల్లో బిల్లులు రావాలంటే 8 శాతం నుంచి 15 శాతం ట్యాక్స్ వచ్చింది. హైదరాబాద్‌లో ఎవరైనా బిల్డింగ్ కట్టాలంటే స్కేర్ ఫీట్‌కు రూ.వంద ట్యాక్స్ కట్టాల్సిందే' అని హరీశ్ దుయ్యబట్టారు. అన్ని రంగాల్లో విఫలమైన రేవంత్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ రజని సాయిచంద్, మాజీ చైర్మన్లు ఇంతియాజ్ ఇసాక్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నేత అభిలాష్‌రావు పాల్గొన్నారు.